




కందిపప్పు కొందరికే

డిమాండ్ 530టన్నులు.. వచ్చింది 210

అరకొరగా సరఫరా చేస్తున్న డీలర్లు

చక్కెర పరిస్థితీ అంతే

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో ఈనెల కందిపప్పు దాదాపు 40 శాతానికే అందుతోంది. డిమాండుకు తగ్గ సరఫరా లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పలువురు కార్డుదారులు కందిపప్పు కోసం డిమాండు చేస్తున్నారు. జిల్లాలోని 1457 రేషన్ దుకాణాల పరిధిలో దాదాపు 5,91,318 కార్డులకు 530 టన్నుల కందిపప్పు అవసరం. అయితే 210 టన్నులు మాత్రమే సరఫరా అయింది. తెలుగు రాష్ట్రాల్లో కందుల దిగుబడి భారీగా తగ్గిపోవడమే కారణమని చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాలన్నా అక్కడా ఇదే కొరత పట్టి పీడిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చిన కొద్దిపాటి కందిపప్పునూ డీలర్లు ఎంత మందికి ఇస్తున్నారన్నది ప్రశ్నార్థకం. కొందరు డీలర్లు కందిపప్పునకూ బయోమెట్రిక్‌లో కార్డుదారుల వేలి ముద్ర వేయించుకుని ఇవ్వడంలేదన్న ఆరోపణలున్నాయి. స్టాక్ రాలేదని చెబుతున్నారట. ఎవరైనా గట్టిగా నిలదీస్తే.. అలాంటి వారికి ఇస్తున్నట్లు తెలిసింది. ఇక, చక్కెర కూడా 400 టన్నులు అవసరం కాగా, 175 టన్నులే సరఫరా అయింది. 'జిల్లాకు అవసరమైన కందిపప్పు, చక్కెర రాలేదు. దీంతో పూర్తి స్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేయడం కష్టంగా ఉంది. దీనిపై కలెక్టర్, జేసీకి నివేదికలు సమర్పించాం. ప్రభుత్వంతో మాట్లాడి తెప్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. కొన్ని చోట్ల బియ్యానికి బదులు జొన్నలు పంపిణీ చేస్తున్నారు' అని డీఎస్‌వో శేషాచలం రాజు తెలిపారు.



వేడుకగా కోదండరాముడి చక్రస్నానం

- ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



కపిలతీర్థం పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌ను మునక వేయిస్తున్న అర్చకులు

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం 7.30 గంటలకు లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవర్లను పల్లకిలో ఊరేగింపుగా కపిలతీర్థం ఆలయానికి వేంచేపు చేశారు. 9 నుంచి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు, చక్రత్తాళ్వార్లకు వేణుగోపాలస్వామి ఆలయ మండపంలో స్నపన తిరుమంజనం.. అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. కపిలతీర్థం నుంచి స్వామివారు గోవిందరాజ స్వామి ఉన్నత పాఠశాలలోని పీఆర్ తోటకు వేంచేపు చేశారు. సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరి తీర్థకట్టవీధి, కోటకొమ్మలవీధి, కొత్తవీధి మీదుగా కోదండరామాలయానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ఆంజనేయస్వామి, వైఖానసాచార్యుల ఆలయాల్లో ఆస్థానం చేపట్టారు. రాత్రి 8.30 నుంచి 9.30 గంటల నడుమ ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం



ఉరుసులో జనసందోహం

నాయుడుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో ఎనిమిదేళ్ల తర్వాత హజరత్ అమీర్‌షావలి దర్గా గంధోత్సవం, ఉరుసు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున దొర్నాదుల చెంచుకృష్ణయ్య నివాసం నుంచి మంగళవాయిద్యాల నడుమ గంధం ఊరేగింపుగా బయలుదేరి.. హజరత్ అమీర్‌షావలి దర్గా వద్దకు చేరుకుంది. రాపూరుకు చెందిన సయ్యద్ నూర్‌షావలిచే చదివింపులు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీ, ఉరుసు దర్గా కమిటీ చైర్మన్ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ఆధ్వర్యంలో గంధం పంపిణీ చేశారు. సాయంత్రం దర్గాతోపాటు ఆ ప్రాంతమంతా విద్యుద్దీపాలతో మిరుమిట్లు గొలిపాయి. భక్తులు బారులుతీరి అమీర్‌షావలి దర్గాను దర్శించుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా రద్దీగా మారింది. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీటీడీ మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి, తదితరులు దర్గాను దర్శించుకున్నారు. పాటకచేరి విశేషంగా ఆకట్టుకుంది. ఉరుసులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఊరేగింపుగా వస్తున్న గంధం

మాట ప్రకారం ఉచిత సిలిండర్ల పంపిణీ: నాదెండ్ల



ఈశ్వరమ్మకు గ్యాస్‌సిలిండ్ అందజేస్తున్న మంత్రి, తదితరులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం దీపం-2 పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచిత సిలిండర్లు పంపిణీ చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుపతి నగరం శ్రీకృష్ణదేవరాయల వీధిలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, ప్రభుత్వ విప్ శ్రీధర్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్‌తో కలసి ఆయన శుక్రవారం రాత్రి లబ్ధిదారు డి.చిన్నఈశ్వరమ్మకు సిలిండర్ పంపిణీ చేసి మాట్లాడారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీలో మొదటి, రెండు విడతలను తిరుపతి నుంచే ప్రారంభించినట్లు చెప్పారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సిలిండర్లు ఇస్తున్నామని, ఈ పథకం ద్వారా ప్రభుత్వంపై రూ.2,800 కోట్ల భారం పడుతోందని వెల్లడించారు. కొత్తగా రెండు లక్షల మందికి గ్యాస్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మోహన్, సివిల్ సప్లయిస్ డీఎం సుమతి, డీఎస్వో శేషగిరిరాజు, జనసేన జిల్లా, నగరాధ్యక్షులు పి.హరిప్రసాద్, రాజారెడ్డి, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీడీఆర్ స్పెషల్ డ్రైవ్‌కు

క్యూకట్టిన బాధితులు

- 35 మందికి ప్రీ అప్రూవల్
- వైసీపీ అడ్డగోలుతనంపై పలువురి ఆవేదన
- వారం రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం





టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌కు హాజరైన బాధితులు - దరఖాస్తులను పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, కమిషనరు మౌర్య

మాస్టర్ ప్లాన్ రోడ్లకోసం పోగొట్టుకున్న ఆస్తులు	1074
ఇప్పటివరకు టీడీఆర్ బాండ్లు ఇచ్చినవి	443
ఇవ్వాల్సిన టీడీఆర్ బాండ్లు	631
పరిశీలనలో ఉన్న దరఖాస్తులు	214
టీడీఆర్ పోర్టల్‌లో అప్‌లోడైన ఆస్తులు	412

తిరుపతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ప్లాన్ రోడ్లలో స్థలాలు కోల్పోయిన వారి టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల ధ్రువీకరణ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రారంభమైంది. దాదాపు వందమందికి పైగా బాధితులు క్యూ కట్టారు. ఇదివరకే 45 మందికి ప్రీ అప్రూవల్ ఇవ్వగా, ఇప్పుడు మరో 35 మందికి ఆన్‌లైన్లో లాగిన్ చేశారు. ఒక్కో రోడ్డుకు సంబంధించి వేర్వేరుగా జాబితాలు తయారుచేసి దరఖాస్తులు స్వీకరించారు. భూతగాదాలున్న వాటిని మరోసారి పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెప్పారు. తొలి రోజు ప్రారంభంలో స్పెషల్ డ్రైవ్ కాస్త గందరగోళంగా మొదలైంది. బాధితులకు సరైన సమాధానం, భరోసా ఇవ్వడంలో విఫలమైనట్టు కనిపించింది. కార్పొరేషన్‌కు గిఫ్ట్‌డీడ్ ఇచ్చినవాటికి టీడీఆర్ బాండ్లు ఇవ్వడం సాధ్యపడదని చెప్పడంతో కొందరు ఖంగుతిన్నారు. తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లతో గిఫ్ట్ డీడ్‌లకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలింపచేశారు. టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొని టీడీఆర్ బాండ్ల దరఖాస్తులను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల వారీగా వివరాలు సేకరించారు. టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల పరిశీలన, వాలిడేషన్, రిజిస్ట్రేషన్ చేసే విధానంపై వివరించారు. వైసీపీ నేతలు అడ్డగోలుగా మాస్టర్ ప్లాన్ రోడ్లువేసి, న్యాయం చేస్తామని నమ్మించి మోసం చేశారని ఈసందర్భంగా పలువురు లబ్ధిదారులు ఆవేదన చెందారు. ఈ స్పెషల్ డ్రైవ్ వారం రోజులపాటు కొనసాగనుంది.

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన

టీడీఆర్ దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి, ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తున్నట్లు కమిషనర్ మౌర్య మీడియాకు చెప్పారు. ఆ తర్వాత కమిటీ పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇస్తామని, తర్వాత గిఫ్ట్ డీడ్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో ఎక్కువ మంది నివాస యోగ్యమైన స్థలాలకు కమర్షియల్ డోర్ నంబర్‌తో రిజిస్టర్ చేశారన్నారు. అటువంటి వాటిని, సరైన ధ్రువపత్రాలు జతపరచని వాటిని షార్ట్ ఫాల్ చేశామన్నారు. వీరందరూ సరైన ధ్రువపత్రాలతో వస్తే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. ఇదివరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 9 దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా ఒకదానికి మాత్రమే సరైనదిగా గుర్తించి, తక్కిన ఎనిమిదింటికి అవసరమైన డాక్యుమెంట్లు తీసుకురావాలని షార్ట్‌ఫాల్ లిస్ట్‌లో పెట్టారు. ఈ మేళాలో తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్లు, డీసీపీ మహాపాత్ర, ఏసీపీలు బాలాజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం



చింతలచేనులో 1996 నుంచి రిజిస్ట్రేషన్ జరిగిన భూమిని 2006లో కొన్నాం. మాస్టర్ ప్లాన్ రోడ్డుకు మా స్థలం పోతుంటే అభ్యంతరం చెబితే, అభినయ్ రెడ్డి మమ్మల్ని నమ్మించి మోసం చేశారు. రోడ్డుకు అంగీకరించిన తర్వాత మా స్థలం 22ఏ (నిషేధిత జాబితా)లో ఉందని చావుకబురు చెప్పారు. ఆవేదనతో నా భర్తను కోల్పోయా. గత వైసీపీ హయాం నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. న్యాయం జరగకపోతే ఇక చావే శరణ్యం. - నిర్మల

నోటీసులివ్వకుండా రోడ్డేశారు



మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రోడ్డు వేశారు. మా స్థలాలను దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. నేను తెలుసుకుని వెళ్లి అడిగితే డాక్యుమెంట్లు తీసుకుని మున్సిపల్ కార్యాలయానికి రమ్మన్నారు. ఏడాదిపాటు తిప్పుకున్నారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్థలానికి ఇబ్బంది లేకుండా రోడ్డు వేయడంతో కమర్షియల్ విలువ రావాల్సిన మా స్థలం రెసిడెన్షియల్ పరిధిలోకి వెళ్లింది. మాకు ఆధారమైన వంద అంకణాల స్థలం పోయింది. దానికి ప్రత్యామ్యాయంగా టీడీఆర్ బాండ్లు ఇస్తే వాటితో ఏం చేసుకోగలం. - సుమాంజలి

ఆరడుగుల స్థలం మిగిల్చారు



హీరో షోరూం సమీపంలో 1987లో 200 చదరపు మీటర్ల స్థలం కొని ప్రహరీ కట్టి భద్రపరుచుకున్నా. మూడేళ్ల కిందట మాస్టర్ ప్లాన్ రోడ్డువేసి.. రోడ్డుకు ఆరు అడుగుల వెడల్పుతో అడ్డదిడ్డమైన పొడవుతో కొంత స్థలాన్ని మిగిల్చారు. తీసుకుంటే మొత్తం తీసుకోండి. దానిని నేనేమి చేసుకోగలనని అధికారులకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నా. కానీ న్యాయం జరగలేదు. ఇప్పుడైనా జరుగుతుందని వచ్చా. - శంకర్ నాయుడు

కోర్ బ్రాంచిలే అసలైన ఆవిష్కరణకు పునాదులు

- రానున్న నాలుగేళ్లలో వీటికి మరింత డిమాండ్
- స్పష్టం చేసిన ముఖ్య అతిథి ఆర్వీ చక్రపాణి
- విజనరీ సీఎం ఆధ్వర్యంలో ఐఐటీ మరింత పురోగతి సాధిస్తుందన్న డైరెక్టర్



వేదికపై మాట్లాడుతున్న ముఖ్య అతిథి ఆర్వీ చక్రపాణి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అసలైన ఆవిష్కరణకు పునాదులు ఇంజినీరింగ్‌లోని కోర్ బ్రాంచ్‌లేనని ఆర్వీ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ లిమిటెడ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్వీ చక్రపాణి స్పష్టంచేశారు. తిరుపతి ఐఐటీ 10వ వార్షికోత్సం సందర్భంగా శుక్రవారం ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్ విభాగాల్లో చేరేందుకు పోటీ పడుతున్నారని, ఐతే ఇంజినీరంగ్‌లో కోర్ బ్రాంచిలైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచిలు లేకుండా ఏఐ, డేటాసైన్స్ మనలేవన్నారు. అందుకని ఏఐ, డేటా సైన్స్ తీసుకున్నప్పటికీ కోర్ బ్రాంచిల్లో బేసిక్స్‌పై పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అప్పుడే సాంకేతికంగా మంచి ఆవిష్కరణలు సాధ్యమవుతాయన్నారు. ప్రస్తుతం కోర్ బ్రాంచిల కంటే ఏఐ, డేటాసైన్స్ వారికే ప్యాకేజి అధికంగా ఉంటోందని, అయితే, రానున్న నాలుగేళ్లలో ఇంజినీరింగ్ రంగంలో పెను మార్పులు జరిగి కోర్‌బ్రాంచిలకు డిమాండ్ బాగా పెరుగుతుందని చెప్పారు. దీనికిగాను దేశంలోని అన్ని ఐఐటీలను కలుపుకొని ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. దీనికి సంబంధించిన వర్క్‌షాప్‌ను తిరుపతి ఐఐటీలోనూ త్వరలో నిర్వహిస్తామన్నారు.

విజనరీ ముఖ్యమంత్రి టెక్ సేవీ

దీనికిముందు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ.. పదేళ్లకాలంలో తిరుపతి ఐఐటీ ఒక్కొక్కటిగా అనేక మైలురాళ్లను అధిగమించిందంటూ వివరించారు. దీనికి చెన్నై ఐఐటీ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకరించాయన్నారు. చంద్రబాబు నాయుడిని విజనరీ ముఖ్యమంత్రిగా, టెక్ సేవీగా ఆయన అభివర్ణించారు. ఆయన నేతృత్వంలో మన ఐఐటీ మరిన్ని ఆవిష్కరణలు చేస్తుందన్నారు. అమరావతిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో తిరుపతి ఐఐటీ కూడా ఒక కీలక భాగస్వామిగా ఉందన్నారు. హబ్ ద్వారా సాంకేతిక పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఐఐటీ మరిన్ని మైలురాళ్లను అధిగమిస్తుందన్నారు. వచ్చే నెలలో తిరుపతి ఐఐటీని సీఎం చంద్రబాబు సందర్శించనున్నారని, అప్పుడు భవిష్యత్ ప్రణాళికలను వెల్లడిస్తామన్నారు.

అవార్డుల ప్రదానం

బీటెక్‌లో ఓవరాల్‌గా ప్రతిభ చూపి, మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ అవార్డులు అందజేశారు. అలాగే సిబ్బందికి స్టాఫ్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. తిరుపతి ఐఐటీ అభివృద్ధికి పాటుపడినందుకుగాను సిబ్బంది రమేష్ (ఏఆర్), విజయ్ (సెక్షన్ ఆఫీసర్), ఇషాక్ అలీఖాన్ (జేటీఎస్), సెంథిల్ (సీనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్)కు అవార్డులు లభించాయి.

పంటల్లో నాణ్యత పెంచడానికే పొలంబడి



పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చంద్రగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో నాణ్యత ప్రమాణాలు పెంచడానికే ఇండి గ్యాప్ పొలం బడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధి కారులు తెలిపారు. తిరుపతి భూలక్ష్మి నేచురల్ ఎస్పీవో ఆధ్వర్యంలో శుక్రవారం చంద్రగిరి పరిసరాల్లో ఇండి గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో 35 మంది రైతులతో పాటు గుంటూరుకు చెందిన ఎక్సటర్నల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ రవి, జిల్లా ఎవాల్యూయేటర్ మునిశేఖర్, మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ పలువురు రైతుల పొలాలను సందర్శించారు. పంటల పరిస్థితిని పరిశీలిం చారు. రైతులకు మెరుగైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిం చారు. రసాయనిక ఎరువుల వినియోగం నివారించాలని, విత్తన ధ్రువీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏడీఏ మనోహర్ బాబు, రేణిగుంట ఏవో సునీల్, ఎర్రావారిపాళెం ఏవో ఖాదర్‌బాషా, టీఏ సుధ, వీఏఏలు సుధ, హర్షిత, ధనశేఖర్, సాజిద్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



పాకాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్య వర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది జి.గురుస్వామి నాయుడు, ఉపాధ్యక్షుడిగా బి.చిన్నరెడ్డప్ప నాయుడు, కార్యదర్శిగా జి.చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సహన్యాయవాదులు, కోర్టు సిబ్బంది అభినందించారు.

ప్రకృతి వ్యవసాయానికి

మహిళలు ముందుకు రావాలి

పాకాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేయడానికి మహిళా సంఘాలు ముందుకు రావాలని మండల ఉద్యాన అధికారి శైలజ, ఏవో పుష్పావతి కోరారు. శుక్రవారం వెలుగు సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసి విషరహిత ఆహారాన్ని పండించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేసి తక్కువ సాగు ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడి సాధించి సహ రైతులకు ఆదర్శంగా వుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్పీ రాధాకృష్ణారెడ్డి ఎంటీ శ్రీదేవి, ఎన్ఎఫ్ఏ గీతారాణి, ఎస్ఆర్‌పీ భానుమూర్తి, ఏపీఎం రామ్మోహన్, ఏపీవో ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

కొటాలలో శ్రీరామనవమి మహోత్సవాలు

చంద్రగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని కొటాల గ్రామంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రత్యేకపూజలు, రామకోటి స్థూప సంప్రోక్షణం, శ్రీరాముని ఏకాంతసేవ, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం మహాపూర్ణాహుతి, కల్యాణోత్సవం జరగనుంది. మధ్యాహ్నం అన్నదానం జరగనుంది.

చంద్రగిరి

వైభవంగా మహాకుంభాభిషేకం



పాకాల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోర్పాడులో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, వేదపారాయణం, మండప దేవత హోమాలు, కళాన్యాసహవనము, నాడీ సంధానం, ప్రాణప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. అనంతరం మహాకుంభాభిషేకం, స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేష అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా ప్రవచన కర్త డాక్టర్ మేడసాని మోహన్ విచ్చేసి శ్రీరామ వైభవాన్ని ప్రవచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సూరినేని దామోదరం, వైస్ చైర్మన్ డి.వేణునాయుడు, ప్రధాన కార్యదర్శి వి.కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ఎస్.భాస్కర్ నాయుడు, ట్రెజరర్ ఎస్.ఆదికేశవులు నాయుడు, సభ్యులు డాక్టర్ ఎస్.మోహన్‌నాయుడు, ఎస్.నరసింహులు నాయుడు, డి.దీపక్, ఎస్.హరిప్రసాద్, జి.శశికుమార్, ఎస్.దేవరాజులు నాయుడు, వి.రవికుమార్ చౌదరి, బి.విశ్వనాథరావ్, వి.జ్యోతీప్రకాష్‌నాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై

మొగ్గుచూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న షణ్ముగం

రామచంద్రాపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గుచూపాలని జిల్లా వ్యవసాయ సాధికార సమితి డీపీఎం షణ్ముగం కోరారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో మహిళా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన ధాన్యాలను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఏవో స్రవంతి మాట్లాడుతూ సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తే తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయ కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని తెలియజేశారు. మంచి ధరలతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిరమ్మ, ఏపీఎం గురుమూర్తి, పట్టాభిరెడ్డి, మహిళా రైతులు, పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మహిళలు, రైతుల అభివృద్ధికి కృషి : నాని

● దుర్గసముద్రంలో టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం ● రూ.6.45లక్షల విలువచేసే వ్యవసాయపనిముట్ల పంపిణీ



టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మహిళలతో ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): మహిళలు, రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆదిశగా పలు కార్యక్రమాలను చేపడు తోందని ఎమ్మెల్యే పులివర్తినాని తెలిపారు. తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు ప్రభుత్వం రాయితీ ద్వారా అందించిన రూ.6.45లక్షల విలువచేసే వ్యవసాయ పని ముట్లు పంపిణీ చేశారు. అడపారెడ్డిపల్లెలో పశువులనీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గానికి రూ.50లక్షల విలువచేసే వ్యవసాయ పని ముట్లను మంజూరు చేసిన జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా వీటిని రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం దుర్గసముద్రానికి వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశేఖర్ రాయల్ నేతృత్వంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, ఎంపీడీవో రామచంద్ర, రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మధు, బడి సుధాయాదవ్, నాగూరు శ్రీనివాసులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్, నాయకులు బాబురాయల్, రవి, చిన్ని, శ్రీను రాయల్, చంద్రశేఖర్, సుధాకర్, మోహన్, ఓసీరాయల్, శంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామాలయ బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబైన కోదండరామాలయం

చంద్రగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో టీటీడీ అనుబంధ ఆలయంగా ఉన్న కోదండరామాలయంలో ఆదివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు వేశారు. విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. కల్యాణ వేదిక, వాహన మండపం సిద్ధం చేశారు. ఈబ్రహ్మోత్సవాలకు శనివారం అంకురార్పణ జరగనుంది. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 9.05 నుంచి 10 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. 10న హనుమంత వాహనం, 11న స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. 12న సీతారాముల కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ జరగనుంది. కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన వారు రూ.750 చెల్లించి గృహస్థులు(ఇద్దరు) పాల్గొనవచ్చు. 14న వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియ నున్నాయి. 15న శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఊంజల్ సేవ జరగనుంది. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, సంగీత కచేరీలు నిర్వహించనున్నారు.

సర్వే చేసేవరకు నిర్మాణాలు ఆపండి

● పేరూరులో వివాదాస్పద నిర్మాణంపై తహసీల్దార్ ఆదేశం



తిరుపతిరూరల్, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): పేరూరు లెక్కదాఖలలో తిరుపతి- పూతల పట్టు జాతీయ రహదారిని ఆనుకుని చేపడుతున్న నిర్మాణాన్ని సర్వే చేసే వరకు ఆపాలని తహసీల్దార్ రామాంజులు నాయక్ శుక్రవారం ఆదేశించారు. సర్వే నంబరు 2లోని కాలువ స్థలంలో రేకులషెడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఏవైనా రికార్డులు ఉంటే నిర్మాణదారులు తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని తెలియజేశారు. ఇదిలా ఉండగా.. సర్వేనంబరు2లోని విలువైన కాలువస్థలాన్ని గ్రామానికి చెందిన టీడీపీ నేత ఆక్రమించి రేకుల షెడ్డు, ప్రహరీ నిర్మిస్తున్నారని పలువురు అంటుండగా ఈభూమికి సంబంధించి ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలు తమకు ఉన్నాయని నిర్మాణదారులు అంటున్నారు.

సబ్ జైలులో తనిఖీలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆం ధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం శ్రీకాళహస్తి సబ్‌జైలును జిల్లా లీగల్ సెల్ అథారిటీ, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి తనిఖీ చేశారు. సబ్‌జైలులో గదుల పరిశుభ్రత, వంటశాల, స్టోర్‌రూం, బాత్ రూంలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ... ప్రతి రిమాండ్ ఖైదీకి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. బెయిల్, ఉచిత న్యాయం వంటి వాటి గురించి తెలుసుకోవాలన్నారు. ఏ సమస్య ఉన్నా ఆర్జీ రూపంలో ఇస్తే పరిష్కరిస్తామని తెలియజేశారు.

తిరుమలకు మంత్రి నాదెండ్ల



మంత్రికి స్వాగతం పలుకుతున్న రిసెప్షన్ అధికారులు

తిరుమల, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీవారి దర్శనార్థం శుక్రవారం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి శుక్రవారం రాత్రి ఆయన చేరుకోగా టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్, ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే తిరుమల జనసేన పార్టీ కార్యకర్తలు కూడా ఆయనకు స్వాగతం పలికి కొద్ది సమయం ముచ్చటించారు. కాగా మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

సీజేఐ రాక సందర్భంగా భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా శనివారం రానున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీజేఐకి స్వాగతం పలకడానికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ కూడా తిరుపతికి రానున్నారు. రాత్రికి తిరుమల చేరుకుని ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా భద్రత నిమిత్తం ఎస్పీ హర్షవర్ధనరాజు పోలీసు అధికారులు, సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. డాగ్, బాంబు స్క్వాడ్‌లు, రోడ్డు డిగ్గింగ్ పార్టీలు తనిఖీ చేపట్టాయి. తిరుమల ఘాట్ రోడ్డులో ఎస్టీఎఫ్ పార్టీలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. నలుగురు ఏఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, దాదాపు 800 మంది పోలీసులు, ఎస్టీఎఫ్ బలగాలు, పారా మిలటరీ సిబ్బంది, తిరుమలలో ఆక్టోపస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

బ్రిడ్జి నుంచి పడి పెయింటర్ మృతి



శివకుమార్ మృతదేహం

నారాయణవనం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని బ్రిడ్జిపై నుంచి కింద పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అయితే ఈ సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ పెయింటర్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పుత్తూరు పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన శివకుమార్ పెయింటర్. ఆయనకు భార్య హంస, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నారాయణవనం మండలంలోని వైకుంఠపురంలో ఉంటున్న యువరాజ్‌ను కలవడానికి తన స్నేహితుడు జనార్దన్‌తో కలిసి ద్విచక్రవాహనంలో వెళ్లారు. అయితే ఉదయం 1 గంటకు ఊత్తుకోట బైపాస్ రోడ్డు సముదాయం బ్రిడ్జిపైన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనంతోపాటు శివకుమార్, జనార్దన్ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో శివకుమార్ మృతి చెందగా, జనార్దన్ తీవ్రంగా గాయపడినట్టు శివకుమార్ మరో స్నేహితుడు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. తన భర్త ప్రమాద కారణాలు కనుక్కోవాలంటూ హంస పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు



డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండ తీవ్రత, వడగాడ్పులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలని డీఆర్వో నరసింహులు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఎండతీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటికే పరిమితం కావాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలని సూచించారు. నీరసం, కళ్లు, తల తిరగడం వంటి సమస్యలు ఉండే వారిని చల్లటి ప్రదేశాల్లో ఉంచాలన్నారు. బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులకు గ్రాసం, నీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి, జడ్పీ డిప్యూటీ సీఈవో జుబేదా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసీపీ వీధి నాటకం



నాటకాన్ని ప్రదర్శిస్తున్న అభినయ్, వైసీపీ శ్రేణులు

తిరుపతి/జీవకోన, ఏప్రిల్4 (ఆంధ్రజ్యోతి): 'విద్యుత్ దోపిడీకి గుణపాఠం చెబుదాం' పేరిట వైసీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్ ఆధ్వర్యంలో శుక్రవారం వినాయక సాగర్‌లో వీధి నాటక ప్రదర్శన జరిగింది. వైసీపీ శ్రేణులు పాల్గొని ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నాటక ప్రదర్శన చేపట్టారు. విద్యుత్ బిల్లులకు మంట పెట్టారు. జై జగన్ అంటూ నినదించారు. అనుమతి లేకుండా వినాయకసాగర్‌లో వీధి నాటకం వేయడంపై కార్పొరేషన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. అభినయ్‌కు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. వైసీపీ నేతలకు మతిభ్రమించి నాటకాలాడుతున్నారని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ధ్వజమెత్తారు. ఉదయం 6 గంటలకు వినాయక సాగర్‌లో వీధి నాటకం ఆడటం.. వాకర్స్‌ను ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. కాగా, వినాయక నిమజ్జన కమిటీ ఆహ్వానం మేరకు 2023 సెప్టెంబరు చివరి వారంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నేతృత్వంలో నేతలు ఆర్సీ మునికృష్ణ, వేణుగోపాల్ నాయుడు, రుద్రకోటి సదాశివం తదితర నాయకులు వినాయక సాగర్‌కు వెళ్లారు. వారిచేతుల్లో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ' కరపత్రాలు ఉన్నాయి. దీంతో ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి నిమజ్జనానికి వస్తున్నారని, కరపత్రాలు పట్టుకుని ఉండకూడదంటూ అప్పటి మున్సిపల్ డీఈ విజయకుమార్ రెడ్డి వీరిని బలవంతంగా బయటకు పంపారు. మరి, ఇప్పుడు అభినయ్ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

వైసీపీ నేతల నుంచి నన్ను రక్షించండి

● సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ మహిళ ఆవేదన



తిరుపతిరూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల నుంచి తమను రక్షించాలంటూ ఓ మహిళ సోషల్ మీడియా వేదికగా వేడుకోవడం శుక్రవారం వైరల్ అయింది. ఆ ప్రకారం వివరాలిలా ఉన్నాయి. 'నా పేరు శ్రీదేవి. నా ఇంటి సమస్యని పరిష్కరిస్తానని వైసీపీ నేత అభినయ్ ప్రాణస్నేహితుడు కృష్ణ చైతన్యయాదవ్ 2021 అక్టోబరు ఒకటో తేదీన నా ఇల్లు రాయించుకున్నాడు. నాకు డబ్బులు ఇవ్వకుండా మోసపూరితంగా మురళిరెడ్డికి అమ్మేశాడు. మురళిరెడ్డి, చైతన్య కలిసి రౌడీలను తీసుకొచ్చి నా ఇంటి తలుపులు పగలగొట్టి నన్ను చంపడానికి ప్రయత్నించారు. నేను, మాఅమ్మ మాత్రమే ఉంటున్నాం. మానాన్న ఎక్స్ మిలటరీ బీఎస్ఎఫ్‌లో పనిచేశారు. నాకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకోవడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ వద్దకు వెళ్లాలన్నా డబ్బులు లేవు. నన్ను రక్షించండి. నా ఇంటిమీద అప్పులు ఉన్నాయి. నన్ను అప్పులోళ్లు చాలా ఇబ్బంది పెడుతున్నారు. ఎలాగైనా మీరే నాకు న్యాయం చేయండి. వైసీపీ వాళ్ల చైతన్య, మురళిరెడ్డి నుంచి నన్ను రక్షించండి. లేదంటే నాకు, మాఅమ్మకి చావే శరణ్యం' అని కన్నీరు పెడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమెది తిరుపతిరూరల్ మండలం శ్రీనివాసపురం అని తెలిసింది.

ఊరందూరులో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ఊరందూరులో స్వామిఅమ్మవార్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్ర సూనాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వరస్వామికి మండలంలోని ఊరందూరులో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉగాది తరువాత ఆరుద్ర నక్షత్రం రోజున స్వామి అమ్మవార్లు ఊరందూరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వేంచే యడం ఆనవాయితీ. ముందుగా ఆల యంలోని అలంకార మండపంలో స్వామి అమ్మ వార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఊరందూరు నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వేంచేశారు. అక్కడ విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం సాయంత్రం స్వామిఅమ్మవార్లు పాన గల్, సన్నిధివీధి, నాలుగుమాడ వీధుల్లో ఊరే గింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించవద్దు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కుదింపు పేరుతో టీటీడీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించవద్దని సీఐటీయూ నేత టి.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల టీటీడీ అధికారులు సీఎంతో జరిపిన సమావేశంలో గత ప్రభుత్వ హయాంలో 4వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అదనంగా నియమించారని తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపారు. దాని ఆధారంగా అదనంగా ఉన్నారంటూ తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పడం సమంజసంకాదని పేర్కొన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, పనిభారం తగ్గించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

సీతారాం ఏచూరి నగర్ దాహార్తి తీర్చండి


కలెక్టరేట్ వద్ద సీపీఎం నేతలతో కలిసి ఆందోళన చేస్తున్న పెట్లూరు ప్రజలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తమ కాలనీకి తాగునీరు ఇవ్వాలని, అటవీ శాఖ దౌర్జన్యాలను అడ్డుకోవాలని వెంకటగిరి మండలం పెట్లూరు గ్రామం సీతారాం ఏచూరి నగర్ దళిత, గిరిజనులు డిమాండ్ చేశారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలంటూ కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులతో కలిసి ఆందోళన చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ పేదలపై అటవీశాఖ అధికారులు దౌర్జన్యం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. భూస్వాములు అటవీ శాఖ భూములను ఆక్రమిస్తే పట్టించుకోని అధికారులు నిరుపేదలపై ప్రతాపం చూపడం సరికాదన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, సీపీఎం నేతలు రమణయ్య, మునిరాజ, చెంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ్ టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం



తిరుపతి(విద్య), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని గౌతమ్ టాలెంట్ స్కూల్ 27వ వార్షికోత్సవాన్ని శుక్రవారం మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాహితీవేత్త జి.శ్రీదేవి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువుకు సముచిత స్థానం ఉందన్నారు. డైరెక్టర్ డాక్టర్ యాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక అవసరాల కోసం మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించాలని, పుస్తక పఠనం ద్వారా జ్ఞానాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. వివిధ విభాగాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో వీబీఆర్ విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో యశోద ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ భూలక్ష్మి

తిరుపతిరూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని డాక్టర్ వీబీఆర్ విద్యాసంస్థలో హైదరాబాద్‌కు చెందిన యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీఎస్సీ నర్సింగ్ ఫైనలియర్, జీఎన్ఎం నర్సింగ్ కోర్సులు చదివే 20మంది విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ డాక్టర్ వేల్పుల విజయభాస్కర్ పేర్కొన్నారు. విద్యార్థులను చైర్‌పర్సన్ త్రిపురదేవి, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, వైస్ ప్రిన్సిపాల్ అతుల్య, అధ్యాపకులు అభినందించారు. ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ భూలక్ష్మి పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళల మృతి


మృతి చెందిన లక్ష్మీప్రసన్న - నారాయణమ్మ

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ పరిధిలో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు... యాదవ కాలనీకి చెందిన లక్ష్మీప్రసన్నకు కొంత కాలంగా భర్తతో గొడవలున్నాయి. భర్త ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మానసిక వేదనకు గురైన లక్ష్మీప్రసన్న(55) ఇంట్లో నిర్జీవంగా పడి ఉండడంతో ఇంటి యజమాని ఈస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇదిలా వుండగా సంజయ్ గాంధీకాలనీలో కాపురమున్న నారాయణమ్మ (46) భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మానసిక వేదనకు గురైంది. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో మృతిచెందింది. భర్త మరణాన్ని తట్టుకోలేక మృతి చెందిందా? లేకుంటే వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఎనిమిది మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో ఎనిమిది మందికి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు నగరంలో చేపట్టిన తనిఖీల్లో అతిగా మద్యంతాగి వాహనాలునడిపిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్ సెక్షన్ వైకుంఠపురం, అమరావతి ఫీడర్లలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. శాంతినగర్, శ్రీకృష్ణానగర్, ఎస్వీ నగర్, అమరావతి నగర్, వెస్ట్‌చర్చి సర్కిల్, న్యూమారుతీ నగర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలు కాపాడండి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు, కార్మికుల ప్రయోజనాలు కాపాడటంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి వైఫల్యం చెందిందని సీపీఎం నేత కందారపు మురళి విమర్శించారు. కర్నూలులో శుక్రవారం ఏపీఈఆర్సీ నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన తిరుపతి నుంచి ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. యాక్సిస్ ఎనర్జీ వెంచర్ ఇండియాతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం వల్ల రూ.16 వేల కోట్ల భారం ప్రజలపై పడే ప్రమాదముందని తెలిపారు. యూనిట్ రూ.2.50కు లభిస్తున్న సమయంలో ప్రైవేట్ కంపెనీ నుంచి రూ.4.60కు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

జగ్జీవన్‌రామ్ జయంతిని విజయవంతం చేద్దాం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని విజయవంతం చేయాలని జగ్జీవన్‌రామ్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ కమిటీ సభ్యులు నల్లని బాబు కోరారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10 గంటలకు బైరాగిపట్టెడ సమీపంలోని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో ఉత్సవాలు జరుగుతాయని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఈస్ట్ సబ్‌స్టేషన్‌లో కరెంట్ కోతలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు సరఫరా కట్ చేశారు. సాయంత్రం 4 నుంచి 4.30 వరకు సరఫరా నిలిపేశారు. దీంతో మధురానగర్, రైల్వే కాలనీ, తిరుమల బైపాస్ రోడ్డుకు పశ్చిమ వైపు, అశోక్‌నగర్, దేవేందర్ థియేటర్ రోడ్డు, చేపల మార్కెట్, అబ్బన్న కాలనీ ప్రాంతాల్లో వినియోగదారులు ఇబ్బందిపడాల్సి వచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్లలో బ్రేకర్లు ఫెయిల్ అయ్యాయని, లైన్‌లు లూజ్‌గా ఉండడంతో మరమ్మతు చేస్తున్నామని ఇలా ఏదో ఒక కారణంతో నెలలో వారం రోజులు అనధికారిక కోతలు విధిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.




నరసింహయాదవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాని - సభలో మాట్లాడుతున్న నరసింహయాదవ్, చిత్రంలో టీడీపీ నేతలు సుగుణమ్మ తదితరులు

నరసింహ యాదవ్‌కు నీరాజనం

ఘనంగా అభినందన ర్యాలీ

తిరుపతి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల అమరావతిలో బాధ్యతలు స్వీకరించిన టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్ అభినందన కార్యక్రమం శుక్రవారం నగరంలో ఘనంగా జరిగింది. ముందుగా ప్రకాశం రోడ్డు వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి నివాళలర్పించి ర్యాలీని ప్రారంభించారు. బాలాజీ కాలనీ నుంచి తుడ మైదానం వరకు సాగిన ర్యాలీలో అడుగడుగునా కూటమి నాయకులు, అభిమానులు నరసింహ యాదవ్‌ను గజమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ తిరుపతి ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, అండమాన్ నికోబార్ దీవుల అధ్యక్షుడు మాణిక్యాలరావు యాదవ్, సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హేమలత, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, కార్పొరేటర్లు కూటమి నేతలు తదితరులు ర్యాలీలో సత్కరించారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీలో కొనసాగారు.

● ఊపిరి ఉన్నంత వరకు విధేయతగా ఉంటా : నరసింహ యాదవ్

ఓపిక ఉన్నంత వరకు కాదు, ఊపిరి ఉన్నంత వరకు తాను, తన కుటుంబం టీడీపీకి విధేయతతోనే ఉంటామని నరసింహ యాదవ్ తెలిపారు. ర్యాలీ అనంతరం తుడా ప్రాంగణంలోని కచ్చపి ఆడిటోరియంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనకు అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్‌లకు రుణపడి ఉంటానన్నారు. బీసీ, యాదవులకు సముచితమైన రీతిలో సేవ చేస్తానని స్పష్టం చేశారు. సన్మానించిన వారిలో కూటమి నేతలు ఊకా విజయకుమార్, శ్రీధర్ వర్మ, రుద్రకోటి సదాశివం, దంపూరి భాస్కర్, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, కుమారమ్మ, విజయలక్ష్మి, కృష్ణ యాదవ్, మస్నం శ్రీనివాసులు నాయుడు తదితరులు ఉన్నారు. ర్యాలీలో పులుగోరు మరళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, ఎస్కే బాబు, నరసింహాచారి, నరేంద్రనాథ్, అన్న రామచంద్ర యాదవ్, అన్నా రామకృష్ణ యాదవ్, అన్న అనిత యాదవ్, శంకర్ యాదవ్, కట్టా జయరామ్ యాదవ్‌లతో పాటు తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్ ఉన్నారు.

మాడుగులకు పద్మశ్రీ గర్వకారణం

సన్మాన సభలో వక్తలు


నాగఫణిశర్మను సన్మానిస్తున్న వీసీలు కృష్ణమూర్తి, రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అవధాని మాడుగుల నాగఫణిశర్మకు పద్మశ్రీ పురస్కారం రావడం గర్వకారణమని పలువురు వక్తలు పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కారం పొందిన సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి సంఘం శుక్రవారం మాడుగుల నాగఫణిశర్మను సన్మానించింది. టీటీడీ జేఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ పద్మశ్రీ దక్కడం మాడుగుల ప్రతిభను తెలియజేస్తోందన్నారు. చదువుకున్న యూనివర్సిటీలోనే సన్మానం పొందడం గొప్ప విషయమన్నారు. సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ మాడుగుల స్ఫూర్తితో విద్యార్థులు సాహిత్య రంగంలో కృషి చేయాలని సూచించారు. వేద విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి మాట్లాడుతూ మాడుగుల నాగఫణి శర్మ కృషిని గుర్తించి ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించడం శుభ సూచకమన్నారు. నాగఫణిశర్మ మాట్లాడుతూ ఇక్కడ అధ్యయనం చేసిన అంశాలే ఇంతటి గుర్తింపు రావడానికి కారణమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కొంపెల్ల రామసూర్యనారాయణ, రిజిస్ట్రార్ కడియం వెంకటనారాయణరావు, డీన్ సత్యనారాయణాచార్య, భారతీయ విద్యా భవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, డీఎస్పీ బాలిరెడ్డి, అధ్యాపకులు గంగిశెట్టి లక్ష్మీనారాయణ, అవధాని భరత్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

రేణిగుంట విమానాశ్రయ భద్రతపై సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయ భద్రతపై కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజుతో కలిసి కలెక్టరేట్‌లో సమీక్షించారు. ప్రముఖుల పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన భద్రతాపరమైన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, విమానాశ్రయ డైరెక్టర్ భూమినాథన్, సీఎస్‌వో రాజేంద్రప్రసాద్, సీఐఎస్ఎఫ్ అధికారి బహదూర్, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎస్పీ శ్రీలత శేఖర్ పాల్గొన్నారు.

రాస్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సేవా సంస్థలు రాష్ట్రీయ సేవా సమితి(రాస్) సేవలను ఆదర్శంగా తీసుకుని మరిన్ని సేవలు అందించాలని డీఎస్పీ శ్రీలత కోరారు. స్థానిక అన్నమయ్య మార్గంలోని రాస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ రాస్ మహిళల కోసం చేతివృత్తుల్లో శిక్షణ, ఆరోగ్య పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి కోసం రుణాలు మంజూరు చేయడం లాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇతర సేవా సంస్థలు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి రాస్‌కు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా నడవలేని వారికి వీల్ చైర్‌ను పంపిణీ చేశారు. వడపప్పు, పానకం పంపిణీ చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, సంయుక్త కార్యదర్శి మమత, డైరెక్టర్ వి.నాగరాజు, బాలాజీ రెడ్డి, అధికారులు రవి, వాణి, వనజ, నాగేశ్వర్, భార్గవి పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇనేష్ సిద్దార్థ

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫొటోగ్రఫీపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఇనేష్ సిద్ధార్థ తెలిపారు. ఫొటోలు తీసే విధానం, తీసిన ఫొటోలు ఎన్ఎఫ్‌టీలో ఎలా అమ్మకం చేయాలో వివరించారు. ఏఐ జనరేషన్‌లో ఫొటోలు ఎంత ముఖ్యం, ఫొటోగ్రాఫర్స్‌కు ఏఐ వల్ల ఎలాంటి నష్టాలు అనే విషయాలను తెలిపారు.

తిప్పారెడ్డికి పీహెచ్‌డీ ప్రదానం


మంత్రి గోవి చెజియాన్ నుంచి పీహెచ్‌డీ అందుకుంటున్న తిప్పారెడ్డి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ఆర్.తిప్పారెడ్డికి చెన్నైకి చెందిన భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. వర్సిటీలో ప్రొఫెసర్ రఘునాథరెడ్డి పర్యవేక్షణలో తమిళనాడు రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యతతో సమస్యలు-దృక్పథాల విశ్లేషణపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం వర్సిటీలో నిర్వహించిన 41వ స్నాతకోత్సవంలో తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ గోవి చెజియాన్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సుందరరాజన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్‌మోహన్, వర్సిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.జగత్రాక్షకన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈయన్ను పలువురు అభినందించారు.

ఎమ్మెల్సీ వీర్రాజుకు ఘన స్వాగతం


సోము వీర్రాజుకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత సోము వీర్రాజు మొదటిసారిగా తిరుపతి చేరుకోగా ఎన్టీఆర్ కూడలి వద్ద ఘనస్వాగతం లభించింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బీజేపీ నాయకులు గుండాల గోపీనాథరెడ్డి,కోలా ఆనంద్, సుబ్రహ్మణ్యం యాదవ్, వరప్రసాద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, రవిప్రసాద్, చంద్ర, లోక, ప్రభాకర్‌నాయుడు, అశోక్‌రెడ్డి, బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ హంట్ పరీక్షలో స్టేట్ ఫస్ట్

తిరుపతి విద్యార్థి వాణిప్రీతం ప్రతిభ


పాకనాటి వాణిప్రీతం

తిరుపతి (విద్య), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టాలెంట్ హంట్ పరీక్షల్లో తిరుపతికి చెందిన పాకనాటి వాణిప్రీతం రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ సంస్థ ఈ పరీక్ష నిర్వహించింది. వాణిప్రీతం తిరుపతి బాలాజీ కాలనీలో గల కేంబ్రిడ్జ్ స్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించిన సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ కల్పన, ఉపాధ్యాయురాలు గుణపాటి శ్రీలక్ష్మి చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకున్నాడు. గతంలోనూ ఇస్రో నిర్వహించిన రాకెట్ మోడల్ పోటీ, సిల్వర్ జోన్ పోటీల్లో బంగారు పతకాన్ని పొందాడు. క్రీడల్లోనూ రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ అందుకుని కర్లింగ్, చెస్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరుస్తున్నాడు. తల్లిదండ్రులు రాధమ్మ, హరికృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.



ఆలయం ముందు పూజాహెగ్డే

తిరుమలేశుని సేవలో బుట్టబొమ్మ

హీరోయిన్ పూజా హెగ్డే శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజాము ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో ఆమె కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. దర్శనం తర్వాత పూజా హెగ్డే ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. మే 1వ తేదీన తన 'రెట్రో' చిత్రం విడుదల కానుందని తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి విరాళంగా మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లు

టీటీడీకి శుక్రవారం రెండు మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లు విరాళంగా అందాయి. అన్నప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసేందుకు వీలుగా బెంగళూరులోని ఎంఎస్ రామయ్య విద్యాసంస్థలకు చెందిన ఎంఎస్ సుందర్ రామ్ అనే భక్తుడు రూ.45 లక్షల విలువైన రెండు అశోక్ లేల్యాండ్ బడాదోస్త్ మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ వ్యాన్లను అందజేశారు. ఆలయం ముందు ఈ వాహనాలకు పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో క్యూలైన్ వెంబడి ప్రసాదాలు, తాగునీరు అందించేందుకు ఈ వ్యాన్లు ఉపయుక్తంగా ఉంటాయని వెంకయ్య చౌదరి తెలిపారు. వాహనంలో ఒకేసారి మూడు వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ట్రాన్స్‌పోర్టు డిపో మేనేజర్ లక్ష్మీప్రసన్న, ఇన్‌ఛార్జ్ డీఐ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.51 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,864

తలనీలాలు సమర్పించినవారు: 25,784







నైపుణ్య శిక్షణ.. భవితకు రక్షణ

- అన్ని వయస్సుల వారూ కంప్యూటర్ నేర్చుకునే అవకాశం
- తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రారంభం

తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

నిత్యజీవితంలో కంప్యూటర్ ఒక భాగంగా అమరిపోయింది. చదువులో, ఉద్యోగంలో, వ్యాపారంలో ఒక అవసరంగా మారిపోయింది. కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం వెనుకబాటుతనంగా ఆత్మన్యూనతను పెంచుతోంది. ఒళ్లో ల్యాప్‌టాప్ పెట్టుకుని కీబోర్డు మీద టకటకలాడించే పిల్లలకూ, వంటావార్పూ పనుల్లో సతమతమయ్యే పెద్దలకూ నడుమ కనిపించని అగాథం పెరుగుతోంది. సర్వ ప్రపంచాన్నీ, సకల సమాచారాన్నీ తనలో ఇముడ్చుకున్న ఆ బుల్లిపెట్టెకు దగ్గర కావడం ఎలాగో తెలీక చాలా మంది అవస్థ పడుతుంటారు. కిరాణా దుకాణాల మొదలు, బట్టల షాపుల దాకా ఎక్కడ పనికోసం వెళ్లినా.. కంప్యూటర్ వచ్చా అని అడుగుతారు. దీంతో చిన్న చిన్న చదువుల దగ్గర ఆగిపోయినవారు అవస్థ పడుతుంటారు. ఇటువంటి వారి కోసమే తిరుపతిలో వేమన విజ్ఞాన కేంద్రం ఒక వినూత్న ప్రయత్నం ప్రారంభించింది. వేసవిలో కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. ఎవరైనా ఇక్కడ కంప్యూటర్ శిక్షణ పొందవచ్చు. కంప్యూటర్‌పై అవగాహన కలిగించడం, అవసరాన్ని బట్టీ తగిన కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం వీరి ఉద్దేశ్యం. సన్నాబన్నా ప్రజలకు ఇదో మంచి అవకాశం.

అర్హత: 7వ తరగతి దాకా చదువుకుని ఉంటే చాలు
కోర్సులు: ఎంఎస్ ఆఫీస్, ఎంఎస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్ , ట్యాలీ
తరగతులు: ఉదయం 8గంటలకు ట్యాలీపై శిక్షణ. సాయంత్రం కంప్యూటర్ ప్రాథమిక పరిజ్ఞానం
బ్యాచ్‌లు: ఉదయం 8 నుంచి ఒక బ్యాచ్. సాయంత్రం 4 నుంచి 6 దాకా ఒక బ్యాచ్. 6 నుంచి రాత్రి 8 దాకా ఒక బ్యాచ్.
వయసు: ఏ వయసు వారికైనా శిక్షణ ఇస్తారు.
వివరాలకు: 99665 84759, 89850 80370

మార్చి 30న లాంఛనంగా తిరుపతి యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు మొదలయ్యాయి. ఈ నెల 2 నుంచీ బ్యాచ్‌ల వారీగా శిక్షణ ప్రారంభించారు. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నవారూ, పేద విద్యార్థులు, గృహిణులు, రిటైరైన ఉద్యోగులు శిక్షణ తరగతులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం 25 కంప్యూటర్లు ఉన్నాయి. వీటి సంఖ్యను మరింత పెంచే ఆలోచనలో ఉన్నారు. పెద్దవాళ్లు కూడా పిల్లల్లా మారి కంప్యూటర్ గురించి తెలుసుకుంటున్నారు.

నేను తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో పని చేస్తున్నాను. నాకు ఉద్యోగంలో కంప్యూటర్ నాలెడ్జ్ అవసరం. ఇక్కడ నేర్పిస్తున్నారని తెలిసింది. శిక్షణ తీసుకుంటున్నాను. దీని వల్ల నాకు ఉద్యోగంలో ఎంతో ఉపయోగం అవుతుంది.

- నాగమణి బాయి



నేను ఆర్టీసీలో రిటైర్ అయ్యాను. నేను ఉద్యోగం చేసే సమయంలో కంప్యూటర్ అవసరం పెద్దగా పడలేదు. ఇప్పుడు కంప్యూటర్ అన్ని చోట్లా అవసరం అయి పోయింది.నాకూ నేర్చుకోవాలనిపించింది. నేను నేర్చుకుంటే నా మనవళ్లు, మనవరాళ్లకు నేర్పించగలను.

- రెడ్డప్ప





నేను పదో తరగతి పరీక్షలు పూర్తి చేశాను. ఇంట్లో ఖాళీగా ఉండడం కంటే కంప్యూటర్ శిక్షణ తీసుకోవడం మేలు. బయట చూసిన సెంటర్ల కంటే ఇక్కడ కంప్యూటర్లు చాలా ఉన్నాయి. శిక్షణ చాలా బాగుంది. ఇంటర్‌లో చేరేటప్పటికే బేసిక్స్ నేర్చుకునేందుకు నాకు వీలు కలుగుతోంది.

- కావ్య



నేనేమీ ఉద్యోగం చేయడం లేదు కానీ ఎక్కడ చూసినా కంప్యూటర్‌లే ఉంటున్నాయి. నాకూ వాటి గురించి తెలుసుకోవాలనిపించింది. వేమన విజ్ఞాన కేంద్రంలో నేర్పిస్తారని తెలిసి వస్తున్నాను. నేను నేర్చుకోవడం నా పిల్లలకు కూడా ఉపయోగపడుతుంది.

- నాగమణి





చాలా ఉపయోగకరం

వేమన విజ్ఞాన కేంద్రం చేస్తున్న అనేక కార్యక్రమాల్లో కంప్యూటర్ శిక్షణ కూడా ఒకటి. మరికొన్ని రోజుల్లో మరిన్ని శిక్షణలను అందుబాటులోకి తీసుకొస్తాం. ప్రస్తుతం 25 కంప్యూటర్లతో ట్యాలీ, కంప్యూటర్ బేసిక్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ కావాలంటూ భిన్న వర్గాల వారు వస్తున్నారు. ఈ శిక్షణను నిరుద్యోగులు, విద్యార్థులు బాగా ఉపయోగించుకోవచ్చు. గృహిణులు, పెద్దవారికి కంప్యూటర్‌పై అవగాహన కలుగుతుంది. వారి ఆసక్తినిబట్టి కోర్సుల్లో శిక్షణ పొందవచ్చు. కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటే ఇంట్లో నుంచీ డబ్బులు సంపాదించే అవకాశాలు ఉన్నాయి.

- పంచముఖేశ్వరరావు, కేంద్రం ఇన్‌చార్జి

తిరుపతి- పళణి బస్సు ప్రారంభం



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి- పళణి బస్సు శుక్రవారం రాత్రి బయలు దేరింది. ఈ సర్వీసును డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గురువారం అమరావతిలో ప్రారంభించిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఆ బస్సు శుక్రవారం రాత్రి 8 గంటలకు బయల్దేరింది. కృష్ణగిరి, పళణికి 15మంది ప్రయాణికులు ఎక్కారు. రోజూ రాత్రి 8 గంటలకు మొదలై చిత్తూరు, పలమనేరు, కుప్పం, కృష్ణగిరి, ధర్మగిరి, భవాని, ఈరోడ్ మీదుగా పళణికి మరుసటి రోజు ఉదయం 7గంటలకు చేరుకుంటుంది. అక్కడ్నుంచి రోజూ రాత్రి 9 గంటలకు ప్రారంభమై ఇదే మార్గంలో మరుసటి రోజు ఉదయం 8గంటలకు తిరుపతికి వవస్తుంది. పెద్దలకు రూ.680, పిల్లలకు రూ.360 చార్జీ. రిజర్వేషన్ సౌకర్యం ఉంది.

తిరుపతి- కాట్పాడి మధ్య ఆరు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): తిరుపతి-కాట్పాడి మధ్య 5 నుంచి 22వ తేదీ వరకు ఆరు ప్యాసింజర్ రైళ్లు రద్దు చేసినట్లు జోనల్ డిప్యూటీ సీవోఎం మణికుమార్ శుక్రవారం తెలిపారు. రామాపురం రైల్వేస్టేషన్ యార్డు వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి బ్రిడ్జి పనులు చేపడుతుండటమే దీనికి కారణమని పేర్కొన్నారు. విల్లుపురం-తిరుపతి మధ్య నడుస్తున్న (16854) ప్యాసింజరు రైలు కాట్పాడి-తిరుపతి మధ్య ఈ నెల 6, 8, 9, 10, 13, 15, 16, 17, 20, 22 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాను సారా రహితంగా మార్చాలి

- ఎక్సైజ్ అధికారుల సమావేశంలో డైరెక్టర్ నిశాంత్‌కుమార్



జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశమైన డైరెక్టర్ నిశాంత్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాను సారా రహితంగా మార్చాలని అధికారులను రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. సీఎం చంద్రబాబు సొంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులు చాలా కీలక పాత్ర పోషించాలని సూచించారు. నవోదయం-2 అమలుపై శుక్రవారం ఆయన తిరుపతిలో అధికారులతో సమావేశమయ్యారు. సారా చుక్క కనిపించకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలపైనా ఉక్కుపాదం మోపాలన్నారు. మళ్లీ మళ్లీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, కల్తీ మద్యంపై రావడంపై కఠినంగా వ్యవహరించాలన్నారు. దీనిపై రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ఠంగా నిఘా ఉంచాలన్నారు. హరియాణా మద్యం పట్టుకుని నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, శ్రీనివాస్, ఏఈఎస్ వాసుదేవ చౌదరి, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీనివాసాచ్చారి, బాలకృష్ణన్ తదితరులున్నారు. అంతకుముందు ఆయన జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.

ఉపాధి బిల్లుల కోసం ఎంపీడీవో సంతకం ఫోర్జరీ

- ఆరిమేనిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ నిర్వాకం
- టీఏతో పాటు ఇద్దరు ఎఫ్ఏల తొలగింపు
- వెంకటరెడ్డిపాళెం ఎఫ్ఏపై పోలీసు కేసు



ఉపాధి పనుల వివరాలను వెల్లడిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పక్కన ఎంపీడీవో విజయలక్ష్మి

ఓజిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల బిల్లుల కోసం ఎంపీడీవో సంతకాన్నే ఫోర్జరీ చేశారు. అవకతవకలు బయటపడతాయని మస్టర్లు, ఎంబుక్‌లు దాచిపెట్టారు. ఓజిలి మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. మండలంలో ఉపాధి పనుల వివరాలను పీడీ శ్రీనివాసప్రసాద్ వెల్లడించారు. రూ.14.94 కోట్లతో 4లక్షల 36వేల 52 పని దినాలు కల్పించామని, ఇందులో రూ.14 కోట్ల చెల్లింపులు జరిగాయని తెలిపారు. పనుల్లో అవకతవకలకు సంబంధించి రూ.1.59 లక్షల జరిమానా విధించామని, రూ.357892 రికవరీకి ఆదేశించామన్నారు. ఆరిమేనిపాడు ఫీల్డ్ అసిస్టెంట్ బిల్లుల కోసం ఎంపీడీవో సంతకం ఫోర్జరీ చేశారని, వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్ తన అక్రమాలు బయటపడతాయన్న కారణంగా మస్టర్లు, ఎంబుక్ దాచి పెట్టారని తెలిపారు. ఆరిమేనిపాడు, వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు టెక్నికల్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించినట్లు పీడీ తెలిపారు. వెంకటరెడ్డిపాళెం ఫీల్డ్ అసిస్టెంట్‌పై పోలీసు కేసు నమోదు చేయించాలని ఎంపీడీవోను ఆదేశించామన్నారు. జిల్లాలో ఓజిలి, పెళ్లకూరు మండలాల్లో ఉపాధి సిబ్బంది పనితీరు అత్యంత అధ్వానంగా ఉందన్నారు. తరచూ తనిఖీలు నిర్వహించి ప్రక్షాళన చేపట్టనున్నట్లు చెప్పారు. సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని, అదే సమయంలో ఉపాధి కూలీలు చైతన్యంతో ఉండాలన్నారు. పని చేసే ప్రాంతంలోనే మస్టర్లు ఉండాలని, పని పూర్తయిన వెంటనే మస్టర్లు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీడీ ప్రేమకుమార్, ఏపీవోలు చిన్నయ్య, ఉషారాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి ఐఐటీలో విద్యార్థులకు, స్టాఫ్‌కు మెరిట్ అవార్డులు



బాలసాయి కృష్ణ - కె.వెంకటశ్రీకృష్ణ - దివ్యంత్ అనంత్ - పలక్ ఖండేల్వాల్ - దీపశిఖ - వీరైన్ సూద్ - ఎం.డెనీకుమార్‌రెడ్డి - ఎ.కృష్ణపాండే - ఎం.మేఘవర్షిణి - కె.ఈశ్వర్ వెంకటసాయి వర్మ



అరవింద్ శ్రీనివాసన్ - సుధాకర్ వెంకటాచలం - శృతి షాజీ - టి.ఆదిత్యన్ - సిద్ధార్థ్ చనం - రాజిత సమంత - బి.రాజేష్‌రెడ్డి - ఒ.జ్యోత్స్న - ఎన్.యమున - పృథ్వీ




రితిక్ మండల్ - ఆకాష్ యూనియల్ - జోదీప్ రాయ్ - అనన్య మండల్ - స్టాఫ్.. ఆర్.రమేష్ - వై.విజయ్ - టి.సెంథిల్ - మహ్మద్ ఇషాక్ అలీఖాన్



తిరుపతి ఐఐటీలో శుక్రవారం చీఫ్‌గెస్ట్ ఆర్వీ చక్రపాణి, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ నుంచి మెరిట్ అవార్డు అందుకుంటున్న విద్యార్థి శ్రీకృష్ణ మధుసూదన్

కాన్పుకోసం భార్యను తీసుకొచ్చి..!

- మద్యం తాగిన భర్త
- మందలించడంతో గొంతు కోసుకున్న వైనం



చికిత్స పొందుతున్న వెంకట కృష్ణారెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కాన్పు కోసం ఆమె.. బ్లేడుతో గొంతు కోసుకోవడంతో అతడు.. ఇలా భార్యాభర్తలిద్దరూ ఒకే ఆస్పత్రిలో చేరారు. మద్యం ఎందుకు తాగావంటూ ఆమె మందలించడంతో అతడు గొంతుకోసుకున్న ఘటన శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం మండలం తొండంబట్టు ఎంజీనగర్‌కి చెందిన వెంకటకృష్ణారెడ్డి.. ఓ ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడు. ఇదే గ్రామానికి చెందిన, శ్రీసిటీలో పనిచేసే పావనిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. ఆరేళ్ల కిందట వారికి కుమారుడు పుట్టాడు. ఆ తర్వాత వెంకటకృష్ణారెడ్డి మద్యానికి బానిసయ్యాడు. ఆ తర్వాత నాలుగుసార్లు ఆమెకు గర్భస్రావం అయింది. ఇప్పుడు తొమ్మిది నెలల గర్భిణి. కాన్పుకోసం శ్రీకాళహస్తికి తీసుకొచ్చిన అతడు.బస్టాండు నుంచి ప్రభుత్వాస్పత్రికి వెళ్లేందుకు ఆటో కోసం వేచి ఉన్నారు. ఆ సమయంలో వెళ్లి మద్యం తాగొచ్చాడు.ఇప్పటికి నాలుగుసార్లు అబార్షన్లు అయినా ఇంకా బాధ్యతారాహిత్యంగా ఉంటే ఎలాగంటూ పావని గట్టిగా మందలించింది. రోడ్డుపైనే అతడు ఆవేశంతో బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు భార్యాభర్తలను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదే ఆస్పత్రిలో అతడు చికిత్స పొందుతుండగా, ఆమె కాన్పు కోసం ఇక్కడే చేరారు.

పుత్తూరు వార్తలు

విధేయతకు పట్టం

● పుత్తూరు ఏఎంసీ చైర్మన్‌గా డీఎస్ గణేష్



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు డీఎస్ గణేష్ విధేయతకు పట్టం కట్టారు. పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్‌గా పార్టీ అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 38 ఏఎంసీలకు చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా పుత్తూరు ఏఎంసీ చైర్మన్‌గా డీఎస్ గణేష్ నియమించింది. 1983 నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా, మాజీ మంత్రి ముద్దుకృష్ణమ సన్నిహితుడుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. అంతే కాకుండా పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, పార్టీ అధ్యక్ష, కార్యదర్శిగా, మున్సిపల్ కమిటీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. తనపై విశ్వాసంతో పుత్తూరు ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు ఈ సందర్భంగా గణేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. పుత్తూరు, పుత్తూరు రూరల్, వడమాలపేట పరిధిలోని రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ పుత్తూరు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతుకు ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

వడమాలపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతులకు ఆర్థిక చేయూత నివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. శుక్రవారం మండలంలోని ఎనమలపాలెంలో ధాన్యం సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటాల్ ధాన్యానికి రూ.2,300లను 24 గంటల్లో రైతులు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏవో విజయ్‌కుమార్, తహసీల్దార్ జరీనా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన ధ్వజస్తంభ సంప్రోక్షణ



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

వడమాలపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ధ్వజస్తంభం సంప్రోక్షణ శుక్రవారం పూర్ణాహుతితో ముగిసింది. ఉదయం శ్రీవారితో పాటు అమ్మవార్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉభయదేవేరులతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి యాగశాలకు వేంచేపు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో వైదిక కార్యక్రమాల అనంతరం 9.30-10.00 గంటల మధ్య పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ఆవరణలో కుంభ ప్రదక్షిణ చేస్తూ ధ్వజస్తంభానికి నివేదన సమర్పణ గావించి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వర నివాళి



పుత్తూరు టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వర ఆలయంలో ఉన్న శ్రీ గీతా సేవా సమాజం ఆధ్వర్యంలో ఘన స్వర నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ వైకుంఠప్రాప్తి పొందిన సందర్భంగా సుభాషిణి వైద్యశాల సహకారంతో రేణుక, ఏ.నాగభూషణం బృందం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి స్వర నివాళి అర్పించింది.

ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోండి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కేవీబీపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై అభాండాలు వేయడం సొంత పార్టీ నాయకులకు సమంజసం కాదని మాజీ ఎంపీపీ మణి, తిరుపతి పార్లమెంటు తెలుగుయువత అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, రాయపేడు సర్పంచ్ బాలాజీ, నాగరాజురెడ్డి చెప్పారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కానీ, ఈ ప్రభుత్వంలో కానీ ఎమ్మెల్యే కేవీబీపురం మండలానికి ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించి ఎన్నో అభివృద్ధి పనులకు నిధులు రాబట్టారన్నారు. అయితే సొంతపార్టీ నాయకులు ఆయనపై విమర్శలు చేయడం మానుకోవాని హితవు పలికారు. ఎమ్మెల్యే బాగుంటే నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే నారాయణవనంలో మాజీ ఎంపీపీ గోవిందస్వామి, పిచ్చాటూరులో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేపై చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చారు. ఇతర పార్టీలతో కుమ్మక్కై తల్లిలాంటి పార్టీకి తీరని అన్యాయాన్ని చేస్తున్నారని ధ్వజమెత్తారు.

మోస్తరు వర్షం... జనం హర్షం



కుమారస్వామి తిప్పవద్ద కురుస్తున్న వర్షం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం చిరుజల్లు కురిసింది. ఇటీవల వేసవి తీవ్రతతో శ్రీకాళహస్తిలో ఎండలు మండిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం 3.20 గంటల సమయంలో పదినిమిషాల పాటు చిరుజల్లు కురిసింది. దీంతో వాతావరణం ఒకసారిగా చల్లబడి ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. అలాగే పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో శుక్రవారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. దీంతో వేసవి తాపంతో అల్లాడిపోతున్న ప్రజలకు కొంత ఊరట కలిగింది. తులసీకృష్ణాపురం, కొత్తగొల్ల కండ్రిగల్లో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. అకాల వర్షంతో పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

శ్రీరామనవమి ఉత్సవాల కమిటీ ఏర్పాటు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు కమిటీ నియమించినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా వాకచర్ల రమేష్, సభ్యులుగా పోలూరు రాధాకృష్ణ, తుర్లపాటి శ్రీనివాసులు, ఎస్.హరిప్రసాద్, మొగళ్లూరు శ్రీలత, బట్టా మాధవి, పేర్నాటి పద్మజా కామాక్షి, మోక్షగుండం శ్రీలత, దొడ్డి భారతిను నియమించారు.

నేడు డక్కిలి మండల మీట్

డక్కిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గుణశేఖరరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తడ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మాంబట్టు, అక్కంపేట సబ్ స్టేషన్ల పరిధిలోని లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



మన్నారుపోలూరులో అసంపూర్తిగా ఉన్న భవనం - దేగలపాలెం వద్ద నాటిన శిలాఫలకం

పట్టణ ఆరోగ్య కేంద్ర భవనాలకు గ్రహణం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో నాలుగేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. 2020లో మన్నారుపోలూరులోని టూరిజం కాంప్లెక్స్‌లో ఒకటి, గాండ్లవీధిలో ఉన్న అన్న క్యాంటీన్‌లో ఈ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. ఆ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక్కొక్క భవనానికి రూ.80 లక్షలు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. 2021లో మన్నారుపోలూరు జగనన్న లేఅవుట్‌లో ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. 65 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు. అసంపూర్తిగా ఉన్న ఆ భవనం మందుబాబులకు నిలయంగా మారింది. అదే విధంగా మరో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి దేగపాలెం వద్ద 2022 జూన్ 30న శిలాఫలకం ఆవిష్కరించి భూమిపూజ చేశారు. తరువాత పునాది కూడా తవ్వలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అన్న క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. దీంతో గాండ్లవీధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సాయినగర్‌లోని అద్దె భవనంలోకి మార్చారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉపాధి అవకాశాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పాలుసు పార్థసారధి, వేదకపై మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, పాశిం, ప్రముఖులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్య అందిస్తుండడంతో ఆదిశంకర విద్యాసంస్థల విద్యార్థులు పలు రంగాల్లో రాణిస్తున్నారని మంత్రులు కొలుసు పార్థసారధి, కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యాసంస్థల సిల్వర్‌జూబ్లీ వేడుకలు విద్యాసంస్థల చైర్మన్ వంకి పెంచలయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని దేశం గర్వించదగ్గ ఇంజనీర్లుగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ టీం నాటి కలు, వందేమాతరం శ్రీనివాస్ గేయాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తమిళనాడు మంత్రి రాజకన్నప్పన్, మాజీ మంత్రి పరసారత్నం, విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య, వంకి ప్రసూన, వంకి అరవింద, వంకి అనూష, వంకి ఐశ్వర్య, రాజమురుగదాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణం నాటిక ప్రదర్శన

ఎన్‌బీకేఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్



శ్రావణికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న యరమల శ్రావణికి డాక్టరేట్ లభించింది. ఇన్వెజిగేషన్ ఆఫ్ ది క్యారెక్టర్ చిప్స్ ఆఫ్ రేయర్ ఎర్త్‌మెటల్ ఖీరియం ఆక్సైడ్ దోస్త్ జిర్కోనియా టఫ్ అండ్ అల్యూమినా సిరామిక్ కాంపోజిస్టు అనే అంశంపై చెన్నైలోని అన్నా యూనివర్శిటీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజా, డాక్టర్ గణేషన్, ప్రొఫెసర్ ఈశ్వరి పర్యవేక్షణలోశ్రావణి పరిశోధనలు చేశారు. శుక్రవారం ఆమెను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డితో పాటు మెకానికల్ విభాగం అధిపతులు డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసులు ప్రశంసాపత్రాలతో అభినందించారు.

విద్యార్థులకు డీఎస్పీ పరామర్శ

గూడూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిల్లకూరు డానియల్ చిల్డ్రన్స్ హోమ్ విద్యార్థులను శుక్రవారం డీఎస్పీ గీతాకుమారి పరామర్శించారు. కల్తీ ఆహారం తినడంతో 11 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. వారిలో ఇద్దరు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిని డీఎస్పీ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో కాంచన అన్నారు. శుక్రవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో చదువులు, క్రీడలలో ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపి కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నవకోటి నాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం: సీపీఎం

గూడూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నామని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక పెద్దమసీదు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లు వల్ల ముస్లింల ఆస్తులను అభివృద్ధి చేసేందుకు వీలుండదన్నారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, జోగి శివకుమార్, బీవీ రమణయ్య, మణి, చంద్రయ్య, నారాయణ, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సిపార్సుతోనే మందులు విక్రయించాలి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వైద్యులు సిపార్సు చేస్తేనే మందులను విక్రయించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ భవనంలో మందుల షాపుల యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. మందులు విక్రయం, వినియోగంపై అవగాహన కల్పించారు. వైద్యుల సూచనల మేరకు మాత్రమే రోగులకు మందులు ఇవ్వాలన్నారు. కాలంచెల్లిన మందులు విక్రయించినా చర్యలు తీసుకుంటా మన్నారు.

ఓజిలి మండల బీజేపీ అధ్యక్షుడిగా పవన్‌కుమార్



బీజేపీ నాయకులతో పవన్‌కుమార్

ఓజిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం బీజేపీ అధ్యక్షుడిగా బిల్లు పవన్‌కుమార్ ఎన్నికయ్యాయరు. శుక్రవారం సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆయనను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండల అధ్యక్షుడు రవీంద్రరాజు, ఆరుముళ్ల వరప్రసాద్, శేషయ్య పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

బాలాయపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శుక్రవారం వడదెబ్బపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి సత్యప్రియ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండతీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, లలిత, నరసింహారావు, రజేశ్వరి, ప్రసూన పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకల్లో అశ్లీల నృత్యప్రదర్శన నిర్వహిస్తే చర్యలు

డక్కిలి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకల్లో అశ్లీల నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ శివశంకర్ హెచ్చరించారు. ఈనెల 6నుంచి ప్రారంభమయ్యే నవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

అభ్యంతరాలపై అర్జీల స్వీకరణ

కోట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ భూముల పరిహారంపై అభ్యంతరాలను తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో అధికారులు సేకరించారు. భూములు కోల్పోయిన రైతుల జాబితాను ఇది వరకే గ్రామసభ ద్వారా ప్రకటించారు.



కొత్తగుంట సెంటర్లో దుకాణం వెనుక పడేసిన హుండీ - బీరువా పగలుగొట్టి చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

చిట్టమూరులో దొంగలు పడ్డారు

ఇళ్లు, ఆలయాలు, దుకాణాల్లో చోరీ

చిట్టమూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలంలో గురువారం రాత్రి దొంగలు పడ్డారు. నాయుడుపేటలో జరిగిన ఉరుసు ఉత్సవాల విధుల్లో పోలీసులు ఉండడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీలకు తెగబడ్డారు. మూడు ఆలయాలు, రెండు దుకాణాలు, మరో మూడు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు... సోమ సముద్రం గ్రామంలోని మందాలమ్మ ఆలయంలో వెండి ఆభరణాలు, తాళిబొట్టు అపహరించుకెళ్లారు. అదేవిధంగా చిట్టమూరమ్మ, తాడిమేడు మణికెట్లమ్మ ఆలయాల్లో చోరీకి యత్నించారు. చిట్టమూరు బీసీ కాలనీలోని షేక్ రఫీ ఇంట్లో ప్రవేశించిన దుండగులు చోరీ యత్నం చేయగా బెడ్ రూములో నిద్రిస్తున్న వాళ్లు బయటకు రావడంతో దొంగలు పరారయ్యారు. మల్లాం గ్రామంలో రాఘవులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలు గొట్టగా విలువైన వస్తువులు లేకపోవడంతో ఇంట్లో ఉన్న మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లారు. మరో ఇంట్లో గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్లారు. కొత్తగుంటలో ఉన్న రఫీ చికెన్ షాపులో హుండీలో ఉన్న రూ.25 వేలు ఎత్తుకెళ్లారు. ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలోని బాబు చిల్లర దుకాణం తాళాలు పగలగొట్టి రూ.2వేలు తీసుకెళ్లారు. ఒకేరోజు మూడు గ్రామాల్లోని పలు ఇళ్లు, దుకాణాలు, ఆలయాల్లో చోరీలు జరగడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. శుక్రవారం ఉదయం ఎస్‌ఐ చిన్న బలరామయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన చోరీ జరిగిన ఆలయాలు, దుకాణాలను పరిశీలించారు. నిందితులను పట్టుకుంటామని ఎస్‌ఐ చెప్పారు.

మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించండి



జీఎం సిన్హాతో మాజీ ఎంపీ వరప్రసాద్, జోసెఫ్, మస్తానయ్య

నాయుడుపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుపుతున్న మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని సదరన్ రైల్వే జీఎం సిన్హాను మాజీ ఎంపీ వరప్రసాద్ కోరారు. నాయుడుపేటకు చెందిన సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, డీఆర్‌యూసీసీ మెంబరు పేర్నాటి జోసెఫ్‌తో పాటు మాజీ ఎంపీ వరప్రసాద్ శుక్రవారం చెన్నైలో సదరన్ రైల్వే జీఎంను కలిశారు. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుపుతున్న మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని కోరారు. అలాగే చెన్నై ఎక్స్‌ప్రెస్, డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌లను నాయుడుపేటలో ఆపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కిరణ్, నాగేంద్ర, సాయి, సునీల్ పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

గూడూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌లో నివాసముంటున్న మీరమ్మ(60) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. ఆమెకు బంధువులు ఎవరూ లేకపోవడంతో స్థానికుడైన శరత్‌యాదవ్ మెగాబదర్స్ సేవాసమితి సభ్యులకు తెలియజేశారు. వారు అనాథ అయిన వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించారు.

అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోంది

ఎమ్మెల్సీ సోము వీర్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న వీర్రాజు

రేణిగుంట, ఏప్రిల్ 4, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకు పోతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అభిప్రాయపడ్డారు. శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలో రాష్ట్రంలో అమరావతి రాజధాని, విశాఖ రైల్వే జోన్, ఇలా మరెన్నో పథకాలు రాష్ట్రంలో దూసుకుపోతున్నాయని కితా బిచ్చారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణం విషయంలో ప్రభుత్వం పారదర్శకమైన విచారణ చేపడుతోందని, వారి కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయలు దేరి వెళ్లారు. బీజేపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకు తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు గాయపడ్డాడు. తొట్టం బేడు మండలం కొత్తపాళేనికి చెందిన శంకర్ రెడ్డి రైతు. సొంతపనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి బయలుదేరాడు. అలాగే తమిళనాడుకు చెందిన ఇద్దరు యువకులు తిరుపతి నుంచి చెన్నైకు కారులో వెళ్లే క్రమంలో మార్గమధ్యంలో తొట్టంబేడు మండలం బీడీకాలనీ వద్ద తడ రహదారిపై కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈఘటనలో శంకర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో శంకర్‌రెడ్డికి రెండు కాళ్లు విరగడంతో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు.



నాయుడుపేట పట్టణంలోని హజరత్ అమీర్‌షావలి ఉరుసు మహోత్సవాల సందర్భంగా దర్గాను దర్శించుకుంటున్న టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి - సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ



విద్యుత్ అలంకరణలో హజరత్ అమీర్‌షావలి దర్గా - నిస్మి ఈవెంట్స్‌లో పాటలుపాడుతున్న కళాకారులు

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఆదిమూలం


వ్యవసాయ పనిముట్ల పంపిణీలో ఎమ్మెల్యే తదితరులు

నారాయణవనం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు తిరిగి అధికారం లోకి వచ్చిన పది నెలల్లోనే గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం ఎలకాటూరు రోడ్డు పాలమంగళం(దక్షిణం) ఎస్టీ కాలనీ వరకు నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించారు. అనంతరం బీసీకాలనీలో పశువుల నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు పనిముట్లను పంపిణీ చేశారు. మధ్యాహ్నం నారాయణవనం జడ్పీ హైస్కూల్‌లో మరుగుదొడ్లను, సందు వీధి వద్ద బోరు మోటరు, మినీ ట్యాంకును ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డి, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సీఎం చంద్రబాబు: ఎమ్మెల్యే సుధీర్


వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రైతు పక్షపాతి సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తిలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని విస్మరించిందన్నారు. దీంతో వ్యవసాయం కుంటుపడిందన్నారు. టీడీపీ నాయకులు తాటిపర్తి ఈశ్వరరెడ్డి, చెంచయ్యనాయుడు, మునిరాజా నాయుడు, గాలి మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేధోశక్తి పెంపొందించుకోండి

సిద్దార్థ క్యెస్ట్ ముగింపు సభలో వక్తల పిలుపు


సింపోజియం నివేదికను ఆవిష్కరిస్తున్న అతిథులు

నారాయణవనం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవాలని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం (సిద్ధార్థ క్యెస్ట్) ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగుళూరుకు చెందిన ఇన్ఫోసిస్ అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్ గ్రూపు ప్రిన్సిపాల్ డాక్టర్ జోహన్ సింగ్, తిరుపతికి చెందిన ఇండో ఎంఐఎం లిమిటెడ్ హెచ్ఆర్ మేనేజర్ డాక్టర్ దాసరి కిరణ్‌కుమార్ హాజరయ్యారు. క్యెస్ట్ కన్వీనర్ ప్రొఫెసర్ రత్నకమల మాట్లాడుతూ... సింపోజియం దేశవ్యాప్తంగా అన్ని బ్రాంచిలతో కలిసి 400 మంది పేపర్ ప్రజెంటేషన్ చేశారని, 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. సాంకేతిక విద్యపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినవారిలో ఉత్తమ ప్రతిభ కనబరినవారిని విజేతలగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో క్యెస్ట్ కో కన్వీనర్ మణివాసగం, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే నూతన ఆలోచనలపై దృష్టి

ఎస్ఎస్ఏఎంఓ శివశంకరయ్య


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

రేణిగుంట, ఏప్రిల్ 4, (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే నూతన ఆలోచనల వైపు దృష్టి సారించాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల హెచ్ఎం రఘుప్రసాద్ అధ్యక్షతన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి 40 పాఠశాలల విద్యార్థులు తాము రూపొందించిన ఆవిష్కరణలను, 20 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా శివశంకరయ్య, విశిష్ట అతిథులుగా డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ భానుప్రసాద్, ఈఎండీపీ జోనల్ మేనేజర్ నీలిమ హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను, ప్రాజెక్టులను పరిశీలించారు. మొదటి బహుమతి రేణిగుంట జడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన సేఫ్టీ స్టిక్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో చిట్టమూరు మండలం జడ్పీ బాయ్స్ హైస్కూల్, కరకంబాడి జడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు.

సబ్ జైల్ తనిఖీ


సబ్ జైలును పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఎంఎస్ భారతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం శ్రీకాళహస్తి సబ్‌జైలును జిల్లా లీగల్ సెల్ అథారిటీ, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి తనిఖీ చేశారు. సబ్‌జైలులో గదుల పరిశుభ్రత, వంటశాల, స్టోర్‌రూం, బాత్‌రూంలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ... ప్రతి రిమాండ్ ఖైదీకి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. బెయిల్, ఉచిత న్యాయం వంటి వాటి గురించి తెలుసుకోవాలన్నారు. ఏ సమస్య ఉన్నా అర్జీ రూపంలో ఇస్తే పరిష్కరిస్తామన్నారు. అనంతరం మే 10న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌పై కోర్టు ఆవరణలో సమీక్షించారు. పోలీసులు, కోర్టు సిబ్బంది పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్‌డే


విశ్రాంత ఉద్యోగికి సన్మానం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలో ఉన్న పెన్షనర్స్ భవనంలో శుక్రవారం పెన్షనర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చాగనం ట్రస్టు చైర్మన్ గౌరీ శంకరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు మించిన మహాభాగ్యం లేదన్నారు. విశ్రాంత ఉద్యోగల సంఘం చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... 12వ పీఆర్సీ ఏర్పాటు చేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. డీఏలు, అరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. నగదు రహిత వైద్య చికిత్సలకు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అవకాశం కల్పించాలన్నారు. పురుషోత్తంగౌడ్, పి.వి. ప్రసాద్, వెంకటరమణయ్య, గురురాజారావు, జయరామనాయుడు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

బ్రిడ్జి నుంచి పడి పెయింటర్ మృతి


శివకుమార్ మృతదేహం

నారాయణవనం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని బ్రిడ్జిపై నుంచి కింద పడి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అయితే ఈ సంఘటనపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ పెయింటర్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పుత్తూరు పట్టణం ఎన్జీవో కాలనీకి చెందిన శివకుమార్ పెయింటర్. ఆయనకు భార్య హంస, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో నారాయణవనం మండలంలోని వైకుంఠపురంలో ఉంటున్న యువరాజ్‌ను కలవడానికి తన స్నేహితుడు జనార్దన్‌తో కలిసి ద్విచక్రవాహనంలో వెళ్లారు. అయితే ఉదయం 1 గంటకు ఊత్తుకోట బైపాస్ రోడ్డు సముదాయం బ్రిడ్జిపైన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్రవాహనంతోపాటు శివకుమార్, జనార్దన్ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో శివకుమార్ మృతి చెండగా, జనార్దన్ తీవ్రంగా గాయపడినట్టు శివకుమార్ మరో స్నేహితుడు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. తన భర్త ప్రమాద కారణాలు కనుక్కోవాలంటూ హంస పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రేపు సీతారాముల కల్యాణ మహోత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన నెహ్రూవీధిలోని పట్టాభిరామ మందిరంలో శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం పలు పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 11గంటలకు అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొత్తకాలనీలో మౌలిక వసతులేవీ?

సిమెంటు రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక స్థానికుల ఇబ్బందులు



కేవీబీపురం కొత్తకాలనీలో ఉన్న వీధుల పరిస్థితి - కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న మార్గంలో కనపడని విద్యుత్ స్తంభం

కేవీబీపురం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి కూతవేటు దూరంలో 13 సంత్సరాల క్రితం ఏర్పాటైన కొత్తకాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే కానీ తమను పట్టించుకునేవారే లేరని స్థానికులు వాపోతు న్నారు. సుమారు 400మంది పేదలకు ప్రభుత్వం స్థలాలను కేటాయించింది. అప్పటి నుంచి వారు ఇల్లు నిర్మించుకుంటూనే ఉన్నారు. కానీ సిమెంటు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరుతోంది. కాలనీలో నిర్మించిన ట్యాంకు అలంకారప్రాయంగా మారింది. దీంతో చేసేది లేక కొందరు బోర్లు వే సుకున్నారు. వీధిదీపాలు లేకపోవడంతో రాత్రైతే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని పలుమారు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా స్పందించడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలనీలో మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది.

ఊరందూరులో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు



మేళతాళాల నడుమ ఊరందూరుకు వేంచేస్తున్న స్వామిఅమ్మవార్లు - ఊరందూరులో స్వామిఅమ్మవార్ల ఊరేగింపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి మండలంలోని ఊరందూరులో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉగాది తరువాత ఆరుద్ర నక్షత్రం రోజున స్వామిఅమ్మవార్లు ఊరందూరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వేంచేయడం ఆనవాయితీ. ముందుగా ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్టింపజేశారు. అనంతరం ఊరందూరు నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వేంచేశారు. అక్కడ విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం సాయంత్రం స్వామిఅమ్మవార్లు పానగల్, సన్నిధివీధి, నాలుగుమాడ వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విక్రమ్ నెక్స్ జెన్ సత్తా

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ నెక్స్ జెన్ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్, యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్‌లో సత్తా చాటారు. 2వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో 23మంది విద్యార్థులకు బంగారు పతకాలు వరిచాయి. ఐదుగురికి నగదు బహుమతి, ఆరుగురికి పుస్తక బహుమతి ఆరుగురికి దక్కింది.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం అన్ని విధాలుగా మంచిదని ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు చెప్పారు. మండల వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామ సమాఖ్య లీడర్లు, సంఘమిత్రలు, ఐసీఆర్‌పీలు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుమందులు వల్ల నేడు అనేక రోగాలతో మనిషి జీవన ప్రమాణం తగ్గిందన్నారు. ˆ పుట్టినప్పటి నుంచే పలు రకాల వ్యాధులకు గురి అవుతున్నామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా రైతులను చైతన్యవంతులుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మునెయ్య, ఏపీసీఎన్ఎఫ్ శ్రీకాళహస్తి శిక్షకుడు వెంకటాచలం, అంగనవాడీ సూపర్‌వైజర్ యమున తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు సముచిత స్థానం


నరసింహయాదవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బీసీలకు సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. యాదవ సంక్షేమాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నరసింహయాదవ్ శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. ఆయనకు పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహయాదవ్ టీడీపీ పటిష్ఠతకు ఎంతో కృషి చేశారన్నారు. పార్టీలో కష్టపడిన వారిని అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందనే దానికి నరసింహయాదవ్ ఉదాహరణ అన్నారు.

● రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా గొల్ల నరసింహయాదవ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయన్ను శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జి.దశరథాచారి తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. వజ్రం కిషోర్, చింతగింజల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తపాలా మహాసభలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 6న ఆదివారం నుంచి 8వ తేదీ వరకు అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమెన్, ఎంటీఎస్ మహాసభలు జరుగుతాయని ఆ సంఘం స్థానిక రిసెప్షన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. మహేష్ కల్యాణ్ సదన్‌లో జరిగే సభల్లో అఖిల భారత తపాల సంఘం ప్రముఖులు హాజరవుతారన్నారు. ఖుర్షీద్‌బేగం, మదన్‌మోహన్‌రెడ్డి, శేషాద్రి, మధుబాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


విద్యార్థులకు బహుమతుల పంపిణీ

వరదయ్యపాళెం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని నైతిక విలువలతో నవ సమాజానికి నాంది పలకాలని ప్రధానోపాధ్యాయులు రమణయ్య అన్నారు. వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడాపోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి దాతలు ముందుకు వస్తే పాఠశాల రూపు రేఖలు మారిపోతాయాని ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలోని నెలవాయి ఉన్నత పాఠశాలలో దాతల సహాయంలో నిర్మించిన కళామందిరాన్ని శుక్రవారం సర్పంచ్ సుధాకర్‌నాయుడితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడూతూ పాఠశాల విద్యార్థుల కోసం గ్రామస్తులు కళామందిరాన్ని నిర్మించడం సంతోషదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో పాఠశాల అభివృద్ధికి అనేక మంది ముందుకు రావాలని కోరారు. ఎంఈవో(2) మునిసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో శ్రీసిటీ ఎండీ



తిరుమల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపటినుంచి శ్రీరామనవమి వేడుకలు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాండూరు కోదండ రామ స్వామి ఆలయంలో ఈనెల 6న ఆదివారం నుంచి శ్రీరామనవమి వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.6న ధ్వజ రోహణం,సీతారాముల కల్యాణం, 7న హోమం, పట్టాభిషేకం, గ్రామోత్సవం, 8న వసంతోత్సవం, ధ్వజావరోహణం జరుగుతాయన్నారు.

మంత్రి నాదెండ్లకు ఘనస్వాగతం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శుక్రవారం తిరుపతి విమానాశ్రయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఘనస్వాగతం పలికారు. జనసేన నాయకులు కె.శివకుమార్, భాగ్యలక్ష్మి, నాగరాజు, నితీష్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

జిమ్ ప్రారంభం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయరామరావువీధిలో శుక్రవారం ది స్ట్రెంథ్ క్లబ్ జిమ్‌ను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారభంభించారు. జనార్దన రావు పవార్, అంజూరు శ్రీనివాసులు, మున్నా రాయల్, శరవణకుమార్, ఉదయ్‌కుమార్, సురేష్, పఠాన్ ఫరీద్, పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు.